క్లుప్తంగా

నేడు టైలర్స్ డే

కర్నూలు(అర్బన్): కుట్టు మిషన్ రూపకర్త విలియమ్ హూ జయంతి సందర్భంగా ఏటా ఫిబ్రవరి 28న టైలర్స్ డే ఘనంగా నిర్వహించనున్నట్లు టైలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఖలీల్‌బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 28న సాయంత్రం 5 గంటలకు స్థానిక పెద్ద మార్కెట్ సమీపంలోని ఉర్దూ ఘర్ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి టీజీ భరత్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ హాజరవుతున్నట్లు తెలిపారు. నగరంలోని టైలర్లందరూ ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

1న మంత్రి లోకేష్ రాక

కర్నూలు(సెంట్రల్): మార్చి 1వ తేదీన విద్యాశాఖ, ఐటీ మినిష్టర్ నారా లోకేష్ రాఘవేంద్ర స్వామి దర్శనం కోసం మంత్రాలయం రానున్నారు. ఆయన హెలికాఫ్టర్‌లో వచ్చి స్వామి వారి దర్శనం చేసుకొని తిరిగి వెళ్లిపోతారు.

దామోదరం కృష్ణవేణికి నివాళి



దామోదరం కృష్ణవేణి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సహచరిణి, కర్నూలు జిల్లా నుంచి మొట్టమొదటగా మహిళా మంత్రిగా పనిచేసిన దామోదరం కృష్ణవేణికి దామోదరం సంజీవయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఘననివాళులర్పించారు. గురువారం పెద్దపాడులోని సంజీవయ్య ట్రస్టు కార్యాలయంలో ఆ సంస్థ చైర్మన్ దామోదరం రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దమోదరం సంజీవయ్య కుటుంబం దేశం కోసం పని చేసిందని, అయినా ఆ కుటుంబాన్ని ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. కార్యక్రమంలో సుంకన్న, మల్లికార్జున, రంగస్వామి, మహేష్ పాల్గొన్నారు.

డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీకి 61 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన పరీక్షలకు 61 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 11 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 519 మందికిగాను 458 మంది హాజరు కాగా 61 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వర్సిటీ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు వెల్లడించారు.

సర్టిఫికెట్ల పరిశీలన ఆర్‌యూలోనే చేపట్టాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలోనే అనుబంధ కళాశాలలకు సంబంధించిన అఫ్లియేషన్ సర్టిఫికెట్లను పరిశీలించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు గురువారం వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడుకు వినతి పత్రం అందజేశారు. అఫ్లియేషన్ కమిటీలు కళాశాలల యాజమాన్యాలతో కుమ్మక్కై ఆయా కళాశాలల్లోనే సర్టిఫికెట్లను పరిశీలించడంలో ఆంతర్యమేమిటో అధికారులు ఆలోచించాలని రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్‌ఎఫ్‌ఐ వర్సిటీ కన్వీనర్ రామకృష్ణ, కో కన్వీనర్ మౌలాలి, నాయకులు సాగర్‌యాదవ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

దోమలు పెరగకుండా చూసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు వారానికి ఒకసారి శుక్రవారం ఫ్రైడే - డ్రైడే పాటించాలని, డెంగీ వ్యాప్తి చేసే ఈడిస్ దోమల సంతతి పెరగకుండా చూసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ గురువారం ఒక ప్రకటన ద్వారా సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా శుభ్రంగా ఉంచుకోవాలని, ఇంట్లో వాడుకోవడానికి నీటిని నిల్వ చేసే డ్రమ్ములు, సిమెంట్ తొట్టిలు, ట్యాంకులు, పూలకుండీలు, ఫ్రిడ్జ్ తదితర వాటిని వారానికోసారి శుభ్రం చేసుకోవాలన్నారు. జ్వరంతో బాధపడుతున్న వారు పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు/విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో రక్త పరీక్షలు చేయించుకుని అవసరమైన చికిత్స తీసుకోవాలని సూచించారు. పెద్దకడబూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నాలేకల్లు గ్రామంలో పూర్తిస్థాయి వైద్యం అందించి బాధితులు కోలుకునేలా కృషి చేయాలన్నారు. వైద్య సిబ్బందిచే ఇంటింటి సర్వే నిర్వహించాలని, అవసరమైన వారికి వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన వక్ఫ్ బోర్డు చైర్మన్



కర్నూలు (సెంట్రల్): జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాను వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూలు జిల్లా పర్యటన నిమిత్తం వచ్చిన ఆయన గురువారం సాయంత్రం కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి పలు సమస్యలపై చర్చించారు.

ఒకే అంశంపై 11 చోట్ల కేసులు రెడ్‌బుక్ విధానమా?

- 41 సీఆర్‌పీసీ నోటీసు ఇచ్చి విచారించవచ్చు కదా?
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్



మాట్లాడుతున్న మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): ఒకే అంశంపై 11 పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేయడం రెడ్‌బుక్ విధానామా అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ ప్రశ్నించారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. నటుడు పోసాని కృష్ణమురళిని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వ కర్కశత్వానికి ఎంతో మంది బలి అవుతున్నారని వాపోయారు. పోసాని ఏదైనా తప్పుగా మాట్లాడి ఉంటే అందుకు ఒక చోట కేసు నమోదు చేసి 41 సీఆర్‌పీసీ నోటీసు ఇచ్చి విచారించవచ్చన్నారు. 'నన్ను క్షమించండి. రాజకీయాలకు దూరంగా ఉంటాను' అంటూ.. బహిరంగంగా వేడుకున్నా.. ఉగ్రవాదిని అరెస్టు చేసినట్లు లాక్కెళ్లడం కూటమి ప్రభుత్వ క్రూరత్వానికి నిదర్శనమన్నారు. కక్ష సాధింపు రాజకీయాలు చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు తరిమి కొడతారని హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సైకో అటూ వందల సార్లు బూతులు తిట్టిన చంద్రబాబు, టీడీపీ నేతలపై పోలీసులు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబును, పవన్ కల్యాణ్‌ను తిట్టారని ఏదో ఒక వంకతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలో 10 కేసులకు పైగా పెట్టి వేధించడం కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. ఎల్లకాలం కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉండదని, ఈ విషయాన్ని చంద్రబాబు, నారా లోకేష్, పవన్‌కల్యాణ్ గుర్తు పెట్టుకోవాలన్నారు. 9 నెలల పాలనపై అన్ని వర్గాల ప్రజలు తీవ్ర నిరాశలో ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

నిరంకుశ పాలనపై ప్రజలే తిరగబడతారు

- పోసాని అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి

కర్నూలు (టౌన్): ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నేతలను, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తోంది. అరెస్టులు చేస్తోంది. ఈ నిరంకుశ పాలనపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. నటుడు, దర్శకుడు, రచయిత పోసాని కృష్ణమురళి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించారు. 9 నెలల క్రితం ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. కేవలం వైఎస్సార్‌సీపీ నేతలను హింసించే విధానాలను మాత్రం చేపట్టిందని విమర్శించారు. చెప్పిన మాట ప్రకారం ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం చేతకాని ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ గొంతు నొక్కడమే పనిగా పెట్టుకుందన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు. ఒకవైపు రాష్ట్రంలో పత్తి, టమాట, మిర్చి రైతులు గిట్టుబాటు ధరలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే వారిని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రైతులకు కనీస మద్దతు ధర లేదు. ఆర్‌బీకేలను ఎత్తేశారు. మహిళలను మోసం చేశారు. నిరుద్యోగులను నిలువునా దగా చేశారు. ఉద్యోగాలు ల్లేవు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. పైగా రూ.లక్ష కోట్ల అప్పులు చేసి చంద్రబాబు ప్రభుత్వం సంపద సృష్టి స్తానంటే ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరన్నారు. పేదలను, రైతులను, మహిళలను ఆదుకోవాల్సింది పోయి నిత్యం వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేయడం చేతగాని ప్రభుత్వ పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రత్యర్థులపై కుట్రలు చేయడం మానుకొని, సంక్షేమ పాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. అన్నివర్గాల ప్రజలను మోసగించిన కూటమి పార్టీలకు రానున్న ఎన్నికల్లో దిమ్మదిరిగే తీర్పు ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

కమనీయం.. ఆది దంపతుల కల్యాణోత్సవం



రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివలింగానికి అన్నాభిషేకం, సూర్యనారాయణ స్వామి ఆలయంలో గౌరీ శంకరుల కల్యాణోత్సవం, పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: మహా శివరాత్రి ఉత్సవాలు రెండో రోజు గురువారం ఘనంగా జరిగాయి. శివపార్వతుల కల్యాణం, పల్లకీ సేవలు, రథోత్సవాలు, గ్రామోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జగన్నాథగట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయం ఆవరణలో ఆది దంపతులు శివపార్వతుల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కల్యాణ మూర్తులకు ప్రాకార పల్లకీ సేవ జరిగింది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జగన్నాథ గట్టు అభివృద్ధి సమితి అధ్యక్షుడు ప్యాలకుర్తి నరసింహారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి వాసుదేవయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

- సంకల్‌బాగ్ హరిహర క్షేత్రంలో శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామివారికి విశేషంగా అన్నాభిషేకం నిర్వహించారు. ప్రవచనకర్త కల్లె వేణుగోపాల్ శర్మ సందేశమిచ్చారు. నగర బ్రాహ్మణ సంఘం ఆధర్యంలో జరిగిన వేడుకల్లో సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, అర్చకులు ప్రసన్నస్వామి, గురుస్వామి, నారాయణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.
- ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో లలితా సుందరేశ్వర స్వామివార్ల కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి సందేశమిచ్చారు.
- నిమిషాంబ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం, రథోత్సవం వైభవంగా నిర్వహించారు.
- భగవాన్ బాలసాయి మందిరంలో శివపార్వతుల కల్యాణం కమనీయంగా జరిగింది. బాలసాయి సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రామారావు, సభ్యులు పాల్గొన్నారు.



చిత్తారి వీధిలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, లలితా పీఠంలో కల్యాణమూర్తులుగా శివపార్వతులు, వేడుకల్లో పాల్గొన్న భక్తులు



అశేష భక్తజనం నడుమ రూపాల సంగమేశ్వరస్వామి రథోత్సవం

దివ్య తేజం.. రథోత్సవం



కుంభం తీసుకొస్తున్న దృశ్యం



ఉత్సవమూర్తులను పల్లకీలో తీసుకెళ్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: శ్రీ ఉమా సమేత రూపాల సంగమేశ్వరుని రథోత్సవం శోభాయమానంగా జరిగింది. మహా శివరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా కర్నూలు జగన్నాథ గట్టుపై వెలసిన రూపాల సంగమేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో స్వామివారి ఉత్సవ మూర్తులకు గురువారం రథోత్సవం నిర్వహించారు. వేలాది మంది భక్తుల మధ్య శివపార్వతులు విహరించారు. హర హర మహాదేవ.. శంభో శంకర అంటూ భక్తుల శివ నామ స్మరణతో జగన్నాథ గట్టు మార్మోగింది. చూడముచ్చటగా సాగిన రథోత్సవాన్ని భక్తులు తిలకించి తరించారు. అంతకు ముందు ఉత్సవ మూర్తులను దేవాలయం నుంచి రథం వరకు పల్లకీలో ఊరేగింపుగా తీసుకొచ్చారు. దిన్నెదేవరపాడు గ్రామస్తులు కుంభంతో ఊరేగింపుగా వచ్చి రథానికి నైవేద్యం సమర్పించారు. అభివృద్ధి కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లికార్జున రెడ్డి, పద్మావతి దంపతులు రూ.90 వేల విలువ చేసే ఉత్సవ పల్లకీ, అమ్మవారి తాళి బొట్టు విరాళంగా అందజేశారు. కర్నూలు తహసీల్దార్ టి.వి.రమేష్‌బాబు, ఫెస్టివల్ ఆఫీసర్ సీతారామిరెడ్డి, ఈఓ వై.గురెడ్డి, ప్యాలకుర్తి నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మల్లికార్జునరెడ్డి, వాసుదేవయ్య, సీఐ శ్రీధర్, దిన్నెదేవరపాడు గ్రామపెద్దలు పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. సమితి సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విశ్రాంత ఇంజినీర్‌కు 'గాడిచర్ల' పురస్కారం



సుబ్బరాయుడు

కర్నూలు కల్చరల్: కర్నూలుకు చెందిన విశ్రాంత ఇంజినీర్ ఎం.సుబ్బరాయుడుకు 29వ 'గాడిచర్ల' పురస్కారం ప్రకటించారు. ఈ మేరకు గాడిచర్ల ఫౌండేషన్, సాహితీ సదస్సు అధ్యక్షుడు కురాడి చంద్రశేఖర కల్కూర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాడిచర్ల ఫౌండేషన్, ఎగ్జిబిషన్ సొసైటీ, ఏపీ గ్రంథాలయ సంఘం, విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం గాడిచర్ల పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఆంధ్ర తిలక్ గాడిచర్ల హరిసర్వోత్తమ రావు 66వ పుణ్య తిథిని పురస్కరించుకొని మార్చి 2న కల్లూరు చల్లా కాంపౌండ్‌లోని పురస్కార స్వీకర్త స్వగృహంలో ఉదయం 10 గంటలకు పురస్కారం ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని ప్రకాశం సభా భవనంలో 10.30 గంటలకు సభ జరుగుతుందని తెలిపారు. వీసీ డీవీఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, రాయలసీమ జల సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి అతిథులుగా పాల్గొంటారని వెల్లడించారు.

కూలి రేటు పెంచి 14 నెలలైనా అమలు చేయరా?



నిరసన వ్యక్తం చేస్తున్న సివిల్ సప్లై హమాలీలు

కర్నూలు(సెంట్రల్): సివిల్ సప్లై హమాలీలకు కూలి రేట్లను పెంచాలని 14 నెలల క్రితం నిర్ణయించినా ఎందుకు అమలు చేయడం లేదని కార్మికులు కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం కూడా కర్నూలు ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద సివిల్ సప్లై హమాలీల నిరసన కొనసాగింది. ఈ సందర్భంగా సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణ మాట్లాడుతూ.. సివిల్ సప్లై హమాలీలకు ఇచ్చే కూలీని రూ.25 నుంచి రూ.28కు పెంచినట్లు ప్రకటించినా అమలు చేయడం లేదన్నారు. అలాగే రెండు జతల దుస్తులతోపాటు బోనస్ ఇవ్వాలన్నారు. హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. హమాలీల సమస్యలను పరిష్కరించక పోతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు పీఎస్ రాధాకృష్ణ, రాజు, శివ, వినయ్, ప్రకాష్, రమేష్, శీను తదితరులు పాల్గొన్నారు.

బెస్తలకు ఎమ్మెల్సీ సీటు కేటాయించాలి



మాట్లాడుతున్న పీటీ సాయిప్రదీప్

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో ఖాళీ అయిన ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి బెస్తలకు కేటాయించాలని ఏపీ బెస్త సంఘం రాష్ట్ర కో-కన్వీనర్ పీటీ సాయి ప్రదీప్ డిమాండ్ చేశారు. గురువారం బిర్లా కాంపౌండ్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని బెస్తలు ఇప్పటి వరకు రాజ్యసభ, లోక్‌సభకు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా ఎన్నిక కాలేదన్నారు. రాష్ట్ర స్థాయి చైర్మన్‌లు, డైరక్టర్లుగా కూడా బెస్తలకు అవకాశం కల్పించలేదన్నారు. అలాగే రాష్ట్ర బెస్త ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయలేదని, రాష్ట్రంలోని బెస్తలందరూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కీలక పాత్ర పోషించారని, ఈ క్రమంలో ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని బెస్తలకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రాయలసీమ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, పీజీ వెంకటేష్ పాల్గొన్నారు.

2 నుంచి గోదాగోకులంలో బ్రహ్మోత్సవాలు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని శ్రీగోదా రంగనాయకి సమేత శ్రీరంగనాథ స్వామి దేవాలయం ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గోదా రంగనాథ రామానుజ కూటమి చారిటబుల్ ట్రస్టీలు మారం నాగరాజు గుప్త, పల్లెర్ల నాగరాజు తెలిపారు. త్రిదండి అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. 2వ తేదీ విశ్వరూప సేవ, బాలభోగ నివేదన, శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, 3న శేష వాహన సేవ, కల్పవృక్ష వాహన సేవ, 4న సూర్యప్రభ వాహన సేవ, చంద్రప్రభ వాహన సేవ, 5న హనుమద్ వాహన సేవ, అదే రోజు ఉదయం 10:30 గంటల నుంచి శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి కల్యాణోత్సవం, గరుడ వాహన సేవ, 6న గజ వాహన సేవ, హంస వాహన సేవ, 7న సింహ వాహన సేవ, అశ్వ వాహన సేవ, తిరుమంచై, ఆల్వార్ దోపిడీ ఉత్సవం, పవళింపు సేవ, 8న అష్టోత్తర శత కలశ ఉత్సవాంత స్నపనం కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులందరూ పాల్గొనవచ్చని తెలిపారు.

రేపు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కర్నూలు కల్చరల్: క్లస్టర్ విశ్వ విద్యాలయ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ పురుషుల కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని మార్చి 1వ తేదీన నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వై.జయరాజ్, పూర్వ విద్యార్థుల కమిటీ కన్వీనర్ కె.జి.మల్లికార్జున సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రిన్సిపాల్ ఎం.ఇందిరాశాంతి ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులందరూ హాజరై కళాశాల అభివృద్ధికి, అభ్యున్నతికి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. సమావేశానికి క్లస్టర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు హాజరవుతారని తెలిపారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పద్య నాటకాలకు ప్రాణం పోసిన 'సురభి'



పాతాళ భైరవి నాటకంలో ఆకట్టుకున్న సన్నివేశం

కర్నూలు కల్చరల్: మహా శివరాత్రి పురస్కరించుకుని సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో గురువారం రాత్రి సురభి కళాకారులచే ప్రదర్శించిన పాతాళ భైరవి పౌరాణిక నాటకం ప్రేక్షకులను అలరించింది. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సురభి కళాకారులు కొండలరావు, హారిక వెంగమాంబ, సురభి సంతోష్ జ్యోతి ప్రజ్వలనతో నాటక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. సురభి సమాజాలు పద్య నాటకానికి ప్రాణం పోశాయన్నారు. పద్య నాటకాలకు టీజీవీ కళాక్షేత్రం నిలయమన్నారు. సురభి కళాకారులు అత్యాధునిక సాంకేతిక నైపుణ్యంతో సెట్టింగ్స్‌తో ప్రదర్శించిన నాటకం విశేషంగా ఆకట్టుకుంది. లలిత కళా సమితి మాజీ అధ్యక్షుడు దస్తగిరి, సీనియర్ కళాకారుడు వీవీ రమణారెడ్డి, కళాక్షేత్రం సభ్యులు లక్ష్మీకాంతరావు, పాండురంగయ్య, క్రిష్టఫర్, రమేష్, రాజారత్నం, సంగా ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, యాగంటీశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిటీ ప్లానర్‌గా శోభన్‌బాబు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో డిప్యూటీ సిటీ ప్లానర్‌గా శోభన్ బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. విశాఖపట్నం మహా నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఆయన రెండు రోజుల క్రితం ఇక్కడికి బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన ఆయన్ను టౌన్ ప్లానింగ్ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

ఇంటి తాళం పగులగొట్టి చోరీ

కర్నూలు (టౌన్): నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లోని రాజీవ్ నగర్‌లో గురువారం చోరీ జరిగింది. కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అన్సారీ ఉదయం ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు తాళం పగులగొట్టి రూ.4 లక్షలు, నాలుగు తులాల బంగారం చోరీ చేశారు. సాయంత్రం ఇంటికి వచ్చిన ఆయన చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు



గార్గేయపురంలోని వీధి కుక్కల శస్త్రచికిత్స కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలో వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. ఆయన గురువారం నగర శివారు గార్గేయపురంలోని డంప్ యార్డులో వీధి కుక్కల సంతాన నిరోధక శస్త్ర చికిత్స కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గార్గేయపురంలోని కేంద్రంలో వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు ప్రారంభించినట్లు చెప్పారు. గతంలో పనిచేసిన ఏజెన్సీకి ఏబ్ల్యూబీఐ అనుమతులు లేకపోవడంతో శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయని, అనుమతులు రావడంతో శస్త్ర చికిత్సలు తిరిగి ప్రారంభించామన్నారు. ఒక వీధి కుక్క శస్త్రచికిత్సకు రూ.1500 చొప్పున ఏజెన్సీకి చెల్లిస్తున్నట్లు చెప్పారు. నగరంలో దాదాపు 15 వేల వీధికుక్కలు ఉన్నట్లు గుర్తించామన్నారు. గతంలో 10,054 వీధి కుక్కలకు ఆపరేషన్లు చేసినట్లు చెప్పారు.

శానిటేషన్ సూపర్‌వైజర్ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న హర్షవర్ధన్

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పని చేస్తున్న ఎం.హర్షవర్ధన్ (28) బుధవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈయన స్థానిక సీతారాం నగర్‌లో నివాసం ఉంటున్నారు. నిద్రమాత్రలు మింగి అస్వస్థతకు గురైన ఆయన్ను స్థానిక ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో ఉంచి చికిత్స చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఆసుపత్రి అధికారులు గురువారం అతని ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దీనిపై గురువారం హర్షవర్ధన్ 'సాక్షి'తో మాట్లాడుతూ ఆసుపత్రిలోని ఓ అధికారి వర్కర్ల ముందు తనను అమర్యాదగా మాట్లాడారని, కొందరు యూనియన్ నాయకుల ఫిర్యాదు మేరకు ఎలాంటి విచారణ చేయకుండా తనపై చర్యలకు సిద్ధమయ్యారని, దీంతో అవమానానికి గురై ఆత్మహత్య చేసుకోవాలనుకున్నట్లు చెప్పారు. ఇదే విషయాన్ని నాలుగో పట్టణ పోలీసులకు కూడా చెప్పానని, వారు వీడియో రికార్డు చేశారని, తన కుటుంబ సభ్యులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారని తెలిపారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కానివ్వం



మాట్లాడుతున్న వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్

కర్నూలు (అర్బన్): వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపడతామని ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ స్పష్టం చేశారు. గురువారం స్థానిక ఉస్మానియా కాలేజ్ రోడ్డులో ఉన్న ఉమర్ అరబిక్ పాఠశాలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. మహానుభావులు డాక్టర్ అబ్దుల్ హక్ స్థాపించిన అంజునన్-ఇ-ఇస్లామియా ఆర్గనైజేషన్ ద్వారా ఎలిమెంటరీ స్కూల్, హైస్కూల్, యునాని కాలేజీలు నడుస్తున్నాయన్నారు. ఉమర్ పాఠశాల సమస్యలను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పూర్వవైభవం తెచ్చేలా ప్రయత్నం చేస్తామన్నారు. అనంతరం స్టాఫ్ రూమ్, వాష్ రూమ్, తరగతి గదులను పరిశీలించి అక్కడే ఉన్న పేరెంట్స్, సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నబీహా పర్వీన్, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్, అంజునన్-ఇ-ఇస్లామియా ఆర్గనైజేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.